క్లుప్తంగా

సోషల్ ఆడిట్ గ్రామసభలు



బొల్లాపల్లి: మండలంలోని ఉపాధి హామీ పథకంలో సోషల్ ఆడిట్ బృందాలు ఆయా గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీలు పూర్తయిన గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. రెడ్డిపాలెం, గుమ్మనంపాడు, లాలిపురం, పలుకూరు, రేమిడిచర్ల, గుట్లపల్లి, రావులాపురం పంచాయతీల్లో సామాజిక తనిఖీలు పూర్తి చేసి గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో డీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది ఆయా పనుల్లో జరిగిన తనిఖీల వివరాలను వెల్లడించారు. సామాజిక తనిఖీ పూర్తిస్థాయి నివేదిక బహిరంగపరుస్తామని తెలిపారు. కొన్ని పంచాయతీల్లో మస్టర్లలో తేడాలు, పండ్ల తోటల పెంపకంలో మొక్కలు నీటి సమస్య వల్ల చనిపోయినట్లు గుర్తించారు.

ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం



నరసరావుపేట: రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం ఆర్టీసీ డిపోలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో జిల్లాలోని పలు డిపోలకు చెందిన 70 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. వైద్యవిధాన పరిషత్‌కు చెందిన రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్.వి. శ్రీనివాసరావు ప్రారంభించగా డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి పర్యవేక్షించారు.

నులి పురుగుల నివారణపై..

బొల్లాపల్లి: నులి పురుగుల నివారణకు జాగ్రత్తలు పాటించాలని వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కృష్ణానాయక్ తెలిపారు. నులి పురుగుల నివారణ గురించి పీహెచ్‌సీలో శనివారం అవగాహన కల్పించారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులు పరిశుభ్రత పాటించాలన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నులి పురుగుల నివారణకు ఆల్‌బెండాజోల్‌ను పంపిణీ చేశామన్నారు. 1 నుంచి 2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్రను, 2 నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు ట్యాబ్లెట్ పూర్తిగా పౌడర్ చేసి ఇవ్వాలన్నారు.

పేదవర్గాలకు ఆసరా ముఖ్యమంత్రి సహాయనిధి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి
- ఇప్పటి వరకు రూ.1.5 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ
- నూతనంగా మరో పదిమందికి రూ.9.8 లక్షల చెక్కులు

నరసరావుపేట: నియోజకవర్గంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని పేదవర్గాలకు ఇప్పటి వరకు రూ.1.5 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో నియోజక వర్గంలోని పదిమందికి విడుదలైన రూ.9.89 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ వైద్యరంగాన్ని బలోపేతం చేసి పేదలకు ఆరోగ్య భరోసా కల్పించారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వంలో చాలా తక్కువ మందికి ఈ సేవలు అందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రొంపిచర్ల మండల పార్టీ కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

పీవీకి భారతరత్న చాలా సంతోషం

నరసరావుపేట: దివంగత మాజీ ప్రధానమంత్రి, బహుబాషా కోవిదుడు పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం చాలా సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే గోపిరెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆయన చేసిన ఆర్థిక సంస్కరణల వల్ల ప్రపంచపటంలో మనదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలబడిందన్నారు. మంచి వ్యక్తికి ఇప్పటికైనా భారతరత్న లభించటం సంతోషించతగ్గ విషయమని పేర్కొన్నారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతా పాల్, రొంపిచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, విద్యార్థి విభాగ మూడు జిల్లా కో ఆర్డినేటర్ గోగుల మనోహర్, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, వడియరాజుల సంక్షేమ సంఘ జిల్లా సభ్యుడు వేముల శివ, పట్టణ బీసీ విభాగ అధ్యక్షుడు అచ్చి శివకోటి, బీసీ నాయకులు పల్లపు అంజయ్య, అట్లూరి సుబ్రమణ్యం నాయీ పాల్గొన్నారు.

జగనన్న సారథ్యంలో విద్యావ్యవస్థలో మార్పులు

- ఎమ్మెల్యే బొల్లా బొల్లా బ్రహ్మనాయుడు
- ఘనంగా లయోలా ఉన్నత పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ పరిశీలన అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ లయోలా పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు దేశవిదేశాల్లో అనేక రంగాల్లో రాణిస్తున్నారని, వినుకొండ అభివృద్ధిలో పూర్వవిద్యార్థులు పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి, జడ్పీ కోప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లయోలా పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ అభివృద్ధి కోసం, ప్రజాసమస్యల పరిష్కారంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్పష్టం చేశారు. పట్టణంలోని 18, 17, 10 వార్డుల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో వినుకొండ ఎలా ఉంది? తాను ఎమ్మెల్యేగా ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార శనివారం తెలిపారు. పమిడిమర్రు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 11 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న కె. నాగరాజును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: కడుపునొప్పి తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని టిడ్కో గృహాల్లో గత ఆరునెలల నుంచి లింగం పద్మ (54) ఒంటరిగా నివసిస్తుంది. గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న పద్మ శుక్రవారం మధ్యాహ్నం బాధను భరించలేక పురుగుమందు సేవించింది. కొంత సమయానికి పక్కింటి వారు వచ్చి చూడగా నోటి నుంచి నురుగు రావటం గమనించి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలో ఆరబోసిన మిరపకాయలు చోరీ

ఈపూరు: మండలంలో ఆరబోసిన మిరపకాయలు అపహరణకు గురైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈపూరు గ్రామానికి చెందిన మద్దం కుటుంబరావు, గంజిబోయిన గణపతి పొలంలో మిరపకాయలు ఆరబోసి ఉండగా శుక్రవారం రాత్రి కుటుంబరావు పొలంలో 10 క్వింటాళ్ల మిరపకాయలు, గణపతి పొలంలో 3 క్వింటాళ్ల మిరపకాయలు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితులు తెలిపారు. అయితే విషయం పోలీసులకు తెలపడంతో పోలీసులు వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్న ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. ఈ సంఘటన జరగడంతో పొలాల్లో మిరపకాయలు ఆరబోసుకునే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చోరీ సంఘటనపై కేసు నమోదు

బొల్లాపల్లి: మండలంలోని గంగులపాలెం గ్రామంలో జరిగిన చోరీ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు బండ్లమోటు ఎస్ఐ డి.చెన్నకేశవులు తెలిపారు. గ్రామానికి చెందిన చింతా పాపయ్య, భార్య అలివేలమ్మ, కుటుంబ సభ్యులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొలం పనులకు వెళ్లగా మిట్టమధ్యాహ్నా సమయంలో ఈ చోరీ జరిగిందన్నారు. నక్లెస్‌తో పాటు పలు రకాల బంగారపు వస్తువులు అపహరణకు గురయ్యాయని తెలిపారు. చింతా అలివేలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం తంగిరాలలో అభయ ఆంజనేయ స్వామి వారి దేవాలయ ప్రతిష్టా మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్టను పురస్కరించుకుని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నాదెండ్ల: అయోధ్యలో రామమందిర ప్రతిష్ట పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని గ్రామాలను బీజేపీ సభ్యులు సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా గణపవరంలో రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆలయాన్ని చిలకలూరిపేట కన్వీనర్ తాడిపర్తి జయరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి కస్తూరి వెంకటేశ్వర్లు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి అనిల్‌కుమార్ దేవాలయ కమిటీ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కెల్లంపల్లి సుందరరావులచే సంతకాలు సేకరించారు. అనంతరం వికసిత్ భారత్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంపనున్నట్లు తెలిపారు. పీఎం మోడీ అయోధ్య నిర్మాణం పూర్తి చేయడం చారిత్రక ఘట్టమన్నారు.

ఉద్యమ శిక్షణ కేంద్రంగా యూటీఎఫ్ భవనం

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నరసరావుపేట ఈస్ట్: యూటీఎఫ్ తలపెట్టిన యూనియన్ భవనాన్ని కేవలం సిమెంట్, ఇసుకతో నిర్మించిన భవనంగా భావించకుండా దానిని ఉద్యమ శిక్షణ కేంద్రంగా భావించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో శనివారం యూటీఎఫ్ పల్నాడుజిల్లా భవన నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ, చారిత్రక ప్రాధాన్యత గల పల్నాడులో యూటీఎఫ్ జిల్లా కార్యాలయ భవనం నిర్మాణాన్ని తలపెట్టడం అభినందనీయమని తెలిపారు. భవన నిర్మాణానికి తన వంతుగా రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు నక్క వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాదు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

నరసరావుపేట నూతన డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ



నరసరావుపేట: పోలీసు సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని నూతన డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. శనివారం నరసరావుపేట సబ్‌డివిజనల్ పోలీసు అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తాను పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు డీఎస్పీగాను, విజయవాడ టాస్క్ ఫోర్స్ క్రైం ఏసీపీగా పనిచేశానని చెప్పారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉండే విధంగా అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రజలతో మమేకమై కృషి చేస్తానన్నారు.

వేల్పూరులో శానిటేషన్ పనులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో శానిటేషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి శనివారం తెలిపారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాలు మేరకు వేల్పూరు గ్రామంలో అన్నీ వీధుల్లో మురుగు కాల్వల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా పూడికతీత పనులు చేపట్టామన్నారు. మురుగు కాల్వల్లో దోమల నివారణకు మందును పిచికారీ చేశామన్నారు. జ్వరాలు పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చినట్లు చెప్పారు. సర్పంచ్ బీర్నేడి రత్నగిరి, పంచాయతీ కార్యదర్శులు కొమిటినేని అశోక్ చౌదరి, ఆళ్ళ యుగంధర్ సారథ్యంలో గ్రామస్తులు సహకారంతో శానిటేషన్ పనులు చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.